క్లుప్తంగా

కార్మిక నాయకుడు సుబ్బారావుకు నివాళి



సుబ్బారావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

మల్కాపురం: కార్మికుల సమస్యల పరిష్కారంలో సీఐటీయూ నాయకుడు సుబ్బారావు చూపించిన చొరవ మరువలేమని జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి అన్నారు. సుబ్బారావు వర్ధంతిని పురస్కరించుకుని మల్కాపురం సీఐటీయూ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

7న మెగా రక్తదాన శిబిరం

కేటీబీ నాయకుల వెల్లడి



సమావేశమైన కేటీబీ అసోసియేషన్ సభ్యులు

విశాఖ విద్య: రక్తదానంతో ఆపదలో ఉన్న మరొకరికి ప్రాణదానం చేయవచ్చని కాపు, తెలగ, బలిజ(కేటీబీ) అసోసియేషన్ అధ్యక్షుడు బత్తుల చిరంజీవి అన్నారు. ఈ నెల 7న కాకానినగర్‌లోని కేటీబీ కళాక్షేత్రంలో నిర్వహించ తలపెట్టిన మెగారక్తదాన శిబిరం విజయవంతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై అసోసియేషన్ నాయకులతో సోమవారం సమీక్షించారు. కేటీబీ కళాక్షేత్రం మొదటి వార్షికోత్సవం సందర్భంగా 7 ఉదయం 10 గంటల నుంచి రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రక్తదానం అనేది గొప్ప విషమని, ఇందుకు యువత పెద్ద ఎత్తున ముందుకు రావాలన్నారు. కేటీబీ అసోసియేషన్ సభ్యుల్లో చాలా మంది రక్తదానం చేసేందుకు పేర్లు నమోదు చేసుకోవటం అభినందనీయమన్నారు. ఆసక్తి ఉన్న రక్తదాతలు ఆ రోజు నేరుగా రావచ్చన్నారు.

'9 శాతం వడ్డీకే రుణాలివ్వాలి'



ఎన్ఏడీ మెయిన్ గేటు వద్ద నిరసన తెలుపుతున్న యూనియన్ సభ్యులు

గోపాలపట్నం: కార్మికులకు నేవల్ ఆర్మమెంట్ డిపో సివిలియన్ యూనియన్ కో–ఆపరేటివ్ సొసైటీ పాలక వర్గం అన్యాయం చేస్తోందని ఎన్ఏసీఈఎస్ అండ్ డబ్ల్యూ యూనియన్ ప్రధాన కార్యదర్శి సాలాపు మారయ్య ఆరోపించారు. ఈ మేరకు ఎన్ఏడీ మెయిన్ గేటు వద్ద సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ ఎన్నికల సమయంలో సొసైటీ సభ్యులకు 9శాతం వడ్డీకే రుణాలు ఇస్తామని, ఇప్పుడు 9.99శాతం అంటున్నారన్నారు. సభ్యులకు 9 శాతం వడ్డీతో రుణాలు ఇవ్వాలని, లేనిపక్షంలో మీ పదవులకు రాజీనామా చేసి వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు.

నగరంలో ముమ్మర తనిఖీలు



రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల లగేజీలను డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న సెబ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం : సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా నగరంలో తనిఖీలు ముమ్మరం చేశారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బి.శ్రీనివాసరావు ఆదేశాలతో సెబ్ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సుబ్బారావు ఆధ్వర్యంలో సోమవారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో సెబ్ సిబ్బంది రాజుల నాయుడు, ముసలనాయుడు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నకు జనమే బలం

- మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే రావాలన్నది ప్రజల ఆకాంక్ష
- ప్రతీ ఇంటా లభిస్తున్న ఆదరణే ఇందుకు నిదర్శనం
- ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్



91వ వార్డులో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న ఆడారి ఆనంద్ కుమార్



40వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

గోపాలపట్నం: వైఎస్సార్‌సీపీకి ప్రజలే అండ అని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. పేదల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అందించడంతో లబ్ధి పొందిన వారంతా వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారన్నారు. ప్రచారంలో ప్రతీ ఇంటా తమకు లభిస్తున్న ఆదరణే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. జీవీఎంసీ 91వ వార్డులో ఆ పార్టీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గవర వీధి రామాలయం నుంచి జయప్రకాష్ నగర్ వరకు పర్యటించిన ఆయన ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఎంపీగా బొత్స ఝాన్సీని, ఎమ్మెల్యేగా తనను ఆశీర్వదించాలని కోరారు.

నిత్యం ప్రజల్లోనే.. 'ఆడారి'

బెహరా భాస్కరరావు మాట్లాడుతూ ఆడారి ఆనంద్ కుమార్ తన సొంత నిధులతో ఎన్నో మంచి పనులు చేశారన్నారు. అధికారం వస్తే ఇంకా మంచి అభివృద్ధిని చూస్తామన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే ఎన్నికలు వచ్చాయని కనిపిస్తున్నాడని ఎద్దేవా చేశారు. మన ఆనంద్‌కుమార్ నిత్యం ప్రజలకు అండగా ఉంటున్నారని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ, కార్యకర్తలు, కన్వీనర్లు పాల్గొన్నారు.

40వ వార్డులో ..

సింధియా: వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజలకు ఎంతో మేలు జరిగిందని, పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఫ్యాను గుర్తుపై ఓటు వేసి పశ్చిమ ఎమ్మెల్యేగా ఆడారి ఆనంద్‌కుమార్‌ను గెలిపించుకోవాలని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం 40వ వార్డు పరిధిలోని ఏకేసీకాలనీ, రాజీవ్‌నగర్‌లో నాగేశ్వరరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పథకాల ద్వారా జరిగిన మేలును వివరించారు. మే 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఆడారి ఆనంద్‌కుమార్‌ను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

58వ వార్డులో..

మల్కాపురం: సార్వత్రిక ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. వైఎస్సార్‌సీపీకి చెందిన గృహసారథులు,సచివాలయ కన్వీనర్లు సోమవారం 58వ వార్డు పరిధి పిలకవానిపాలెం,ములగాడ,శ్రీరామ్‌నగర్, శ్రీనివాస్‌నగర్ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. రాష్ట్రానికి జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే బడుగు, బలహీన వర్గాలకు మేలు జరుగుతుందని వివరించారు. అలాగే 59వ వార్డు పరిధి హిమాచల్‌నగర్,గణపతినగర్,గంగానగర్‌,వాయుపుత్రకాలనీ,ములగాడ హౌసింగ్‌కాలనీతో పాటు 60,61వ వార్డుల్లోని పలు ప్రాంతాల్లో ప్రచారం చేశారు.



హిమాచల్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న గృహసారథులు,సచివాలయ కన్వీనర్లు

ఆశీర్వదించండి.. అండగా ఉంటాం

- బొట్టు పెట్టి ఓటు అభ్యర్థిస్తున్న ఆనంద్‌కుమార్ భార్య మాలతి
- వార్డుల్లో మహిళల నుంచి అపూర్వ ఆదరణ



మా ఓటు మీకే .. బొట్టు పెట్టి ఆశీర్వదిస్తున్న మహిళలు



ముత్యమాంబకాలనీలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఆనంద్‌కుమార్ సతీమణి మాలతి

విశాఖ విద్య: పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నాయకులు ప్రచారంలో ముందున్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్‌తో పాటు ఆయనకు మద్దతుగా కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు సైతం విస్తృతంగా ప్రచారంలో పాల్గొంటున్నారు. అయితే ఆడారి ఆనంద్ కుమార్ సతీమణి మాలతి ప్రచారంలో వినూత్నంగా దూసుకెళ్తున్నారు. తన భర్త ఆనంద్ కుమార్ విజయం కోరుతూ ప్రతీ రోజూ నియోజకవర్గంలోని ఏదో ఒక వార్డులో స్థానిక మహిళా నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. కష్టం అని తెలిస్తే సాయం అందించే విషయంలో ముందుండే దివంగత ఆడారి తులసీరావు కుటుంబానికి చెందిన వారంతా ఇలా కాలనీలకు వచ్చి ఓట్లు అభ్యర్థిస్తుండడంతో వారికి అనూహ్యమైన ఆదరణ లభిస్తోంది. సొంత డబ్బులతో ఎంతోమందిని ఆదుకుంటున్న ఆనంద్‌ను ఎమ్మెల్యేగా గెలుపించుకుంటామని మహిళలు ముందుకొచ్చి మద్దతు ప్రకటిస్తున్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి ..

90వ వార్డు బుచ్చి రాజుపాలెం పరిసర ప్రాంతాల్లో ఆడారి ఆనంద్ కుమార్ సతీమణి మాలతి, పార్టీ నియోజకవర్గ పరిశీలకురాలు పేడాడ రమణ కుమారితో కలిసి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమెకు మహిళలు బొట్టుపెట్టి హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె ప్రతి ఇంటికి వెళ్లి ఆడారి ఆనంద్ కుమార్‌ను గెలిపించుకుంటే మీ భవిష్యత్తు బాగుంటుందని తెలియజేశారు. 18 నెలలుగా ఆడారి ఆనంద్ కుమార్ నియో జకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసే మీరు ఓటు వేయండి అని కోరారు. ప్రతి గడపకూ వెళ్లి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ఎందుకు ముఖ్యమంత్రి చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో నాయకులు నమ్మి శ్రీను, చుక్క ప్రసాదరెడ్డి , నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులు, జేసీఎస్ కన్వీనర్లు పాల్గొన్నారు.

56వ వార్డులో..

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి దయానందనగర్, చాకలిగెడ్డ, ముత్యమాంబకాలనీ, రాజీవ్‌కాలనీ, పైడిమాంబకాలనీ మురికివాడ ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌కు మద్దతుగా సోమవారం వార్డు అధ్యక్షుడు ఆడారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఆనంద్‌కుమార్ సతీమణి ఆడారి మాలతి, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకురాలు పేడాడ రమణకుమారి ప్రజలతో మాట్లాడి రానున్న ఎన్నికల్లో తెలిపి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు.

వైఎస్సార్‌సీపీతోనే సమస్యల పరిష్కారం



పిల్లా రమాకుమారి, పీలా ఉమారాణిని సత్కరించిన 62వ వార్డు మహిళా నాయకులు

సింధియా: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వస్తేనే ప్రజల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం అవుతాయని.. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఆడారి ఆనంద్‌కుమార్ గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి కోరారు. జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్‌లో వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో సోమవారం వార్డు మహిళా ముఖ్య నాయకులు, కార్యకర్తలు, స్థానిక మహిళలతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకురాలు పీలా ఉమారాణి మాట్లాడుతూ మే 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని, ఎమ్మెల్యేగా ఆడారి ఆనంద్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేసి బడుగు బలహీన వర్గాలకు చేసిన మేలును ప్రతి కార్యకర్త ఇంటింటికీ తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భీశెట్టి గణేష్, మహిళా నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ హితుడు.. భూషణం మాస్టారు



సేవ్ నేచర్ ప్లకార్డుతో భూషణం మాస్టారు

విశాఖ విద్య: ఉద్యోగ విరమణ పొందినా సమాజాభివృద్ధిలో బాధ్యతను గుర్తు చేసేలా వినూత్న రీతిలో కార్యక్రమాలు చేపడుతూ అందరితోనూ 'మా మంచి మాస్టారు' అనిపించుకుంటున్నారు ఇంటూరి భూషణం. నగరంలోని మధురానగర్ జీవీఎంసీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ మార్చి 31న ఉద్యోగ విరమణ చేశారు. అయినా సమాజహితం కోసం చేపట్టే కార్యక్రమాల్లో భాగంగా సోమవారం టెన్త్ స్పాట్ వాల్యూయేషన్ కేంద్రంలో దర్శనమిచ్చారు.' సేవ్ నేచర్–ప్రకృతిని కాపాడుకుందాం' అనే నినాదాలతో కూడిన ప్లకార్డులు ధరించి స్పాట్ కేంద్రం వద్ద ఉపాధ్యాయులను చైతన్యపరిచేందుకు తన వంతు ప్రయత్నం చేశారు.

ఎన్ఏడీ బుచ్చిరాజుపాలెం ఏపీఎస్ఈబీ కాలనీ చెందిన ఇంటూరి భూషణం మాస్టారు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించిన సమయంలోనూ సెలవు రోజుల్లో నగరంలోని జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఇదే మాదిరి ప్లకార్డులతో పర్యావరణ పరిరక్షణకు పలు కార్యక్రమాలు చేపట్టేవారు. 'ప్రకృతిని కాపాడితే, అది మనల్ని కాపాడుతుందని చెబుతున్నారు భూషణం మాస్టారు'. స్పాట్ వాల్యూయేషన్ కేంద్రాన్ని సందర్శించిన విద్యాశాఖ ఆర్జేడీ విజయ భాస్కర్ అక్కడ ఉన్న భూషణం మాస్టారును చూసి అతని వద్దకు వెళ్లి పలుకరించారు. మాస్టారు..మీ గురించి విన్నాను. మీ కార్యక్రమాలు అందరికీ ఆదర్శమని భూషణం మాస్టారును అభినందించారు. 'మా మంచి మాస్టారు' అంటూ అక్కడ ఉన్న ఉపాధ్యాయులంతా కొనియాడారు.

పోలింగ్ కేంద్రాల్లో సకల వసతులు

ఆర్వో హుస్సేన్ సాహెబ్



ఆర్పీపేట ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్వో హుస్సేన్ సాహెబ్

కంచరపాలెం: పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్వో) హుస్సేన్ సాహెబ్ చెప్పారు. కంచరపాలెం లా అండ్ ఆర్డర్ సీఐ భాస్కర్‌రావుతో కలిసి సోమవారం ఆయన పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కంచరపాలెం, ఐటీఐ జంక్షన్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, 104 ఏరియా విజయనగర్‌కాలనీ, మర్రిపాలెం, ఎన్ఏడీ కొత్తరోడ్డు, కరాసా, బుచ్చిరాజుపాలెం , గోపాలపట్నం, సింధియా, మల్కాపురం, శ్రీహరిపురం ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న కేంద్రాలకు పోలింగ్ బూత్ నంబర్లు, మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. సుమారు 69 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించడం జరిగిందన్నారు. ఆయా కేంద్రాల్లో పోలీస్ బలగాలను మరింత ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు ఆయన సూచించారు.

63వ వార్డులో ప్రచారం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వృద్ధురాలికి వివరిస్తున్న రమాకుమారి, ఉమారాణి

సింధియా: పేద ప్రజల జీవితాలను బంగారుమయం చేయడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి అన్నారు. జీవీఎంసీ 63వ వార్డు కాకరలోవ, చింతల్లోవలో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి, వార్డు అధ్యక్షుడు సోమాదుల సురేష్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల పరిశీలకురాలు పీలా ఉమారాణి, వైఎస్సార్‌టీయూసీ జోనల్ ఇన్‌చార్జి కలిదిండి బద్రీనాథ్‌తో కలిసి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా ఆనంద్‌కుమార్‌ను, ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి సంతోష్, నాయకులు సూరాడ పెంటారావు, అడపాక అప్పారావు, నారాయణమూర్తి, బోని ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి కృషి



వైవీ సుబ్బారెడ్డి, బొత్స ఝాన్సీలను సత్కరిస్తున్న నాయకులు

మల్కాపురం: వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిని, విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీని పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో కార్పొరేటర్లు గులిగిందల లావణ్య, పి.వి.సురేష్, కొణతాల సుధ, 63వ వార్డు పార్టీ ఇన్‌చార్జి పిలక రామ్మోహన్‌రెడ్డి, 61వ వార్డు పార్టీ అధ్యక్షుడు జి.వి.ఎస్.ఎన్.రాజు, సోమాదుల సురేష్ తదితరులు నగరంలోని పార్టీ కార్యాలయం వద్ద వారిని కలిశారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డిని, ఝాన్సీని సత్కరించారు. నాయకులు మాట్లాడుతూ వచ్చే నెలలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని వైవీ సుబ్బారెడ్డికి తెలియజేశారు. పార్టీని పారిశ్రామిక ప్రాంతంలో ఇప్పటికే బలోపేతం చేశామన్నారు. తమ వార్డుల పరిధిలో విస్తృతంగా ప్రచారాలు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ పశ్చిమ ఎన్నికల పరిశీలకులు పీలా ఉమారాణి, పేడాడ రమణికుమారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎయిర్‌పోర్టు వార్షికోత్సవం



విమానాశ్రయంలో ఉద్యోగులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజారెడ్డి

గోపాలపట్నం: విశాఖ విమానాశ్రయం 29వ వార్షికోత్సవాన్ని విమానాశ్రయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎయిర్‌పోర్టు ఉద్యోగుల సమక్షంలో డైరెక్టర్ రాజా రెడ్డి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1995లో విమానాశ్రయం ప్రారంభమైందని చెప్పారు. ఆరోజు నుంచి దినదినాభివృద్ధి చెందుతూ అత్యధిక ప్రయాణికులకు సేవలందిస్తుందన్నారు. ఈ ఏడాది అత్యధికంగా 29.26 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారని తెలిపారు. 17 శాతం వృద్ధి సాధించినట్లు చెప్పారు. ప్రయాణుకులకు ఇబ్బంది లేకుండా 32 చెక్ పాయింట్లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎరైవల్ ప్రాంతంలో టాయిలెట్లు, ఎగ్జిక్యూటివ్ లాంజ్ వంటి సౌకర్యాలు నూతనంగా కల్పించామని చెప్పారు. విమానాశ్రయం అభివృద్ధికి సహకరించిన ఉద్యోగులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రయాణికులకు మరిన్ని వసతులు కల్పించడానికి ప్రయత్నిస్తామని చెప్పారు.

ప్రశాంత పోలింగ్‌కు పటిష్ట చర్యలు

- ఎన్నికల ప్రవర్తనా నియమావళి పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు
- రిటర్నింగ్ అధికారి హుస్సేన్ సాహెబ్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో హుస్సేన్

కంచరపాలెం: విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్వో) హుస్సేన్ సాహెబ్ తెలిపారు. జ్ఞానాపురం జోన్–5 జోనల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పర్యవేక్షణకు మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, మూడు స్టాటస్టిక్ సర్వైలెన్స్ టీమ్‌లు, రెండు వీడియో సర్వైలెన్స్ టీమ్‌లతో పటిష్టంగా నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలైనప్పటి నుంచి 11 మంది నుంచి రూ.15,39,400 నగదు సీజ్ చేశామని చెప్పారు. అక్రమంగా తరలిస్తున్న 110 కేజీల గంజాయిని సీజ్ చేసి తొమ్మిది మందిపై, అక్రమ మద్యం అమ్ముతున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నియమావళి అతిక్రమించిన వారిపై కేసులు

ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించిన కారణంగా ఏడుగురు వలంటీర్లు, 1 రిసోర్స్ పర్సన్, 1 పొలిటికల్ లీడర్‌పై కేసులు నమోదు చేశామని తెలియజేశారు. ఎస్‌వీటీ, ఎఫ్ఎస్‌టీ బృందాలు నియోజకవర్గంలో పర్యటిస్తూ నిఘా ఏర్పాటు చేశాయన్నారు. నామినేషన్లు ప్రారంభించినప్పటి నుంచి పోటీ చేయనున్న అభ్యర్థుల ఖర్చులపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. జోనల్ కార్యాలయం పశ్చిమ రిటర్నింగ్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఫిర్యాదుల నమోదు, ఎన్నికలకు సంబంధించి సమాచారాన్ని తెలుసుకునేందుకు 24/7 పని చేసేలా 0891–294495 నంబర్ అందుబాటులో ఉంటుందన్నారు.

జ్ఞానాపురం యూపీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో



జ్ఞానాపురం ఆరోగ్య కేంద్రంలో సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సోమవారం జ్ఞానాపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని(యూపీహెచ్‌సీ) సందర్శించి, వైద్య సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపీల సంఖ్య ఇంకా పెంచాలని, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. మందులు, వ్యాక్సిన్ నిల్వ చేయడానికి ఫ్రిడ్జ్‌ను ఉపయోగించాలని, టెంపరేచర్ ఎప్పటికప్పుడు నమోదు చేయాలని చెప్పారు. అనంతరం ఆస్పత్రిలోని ఫార్మసీ యూనిట్‌లో మందులు, బ్యాచ్ నంబర్లను డీఎంహెచ్‌వో పరిశీలించి, ఎక్స్‌పైర్ తేదీలను నమోదు చేసుకోవాలన్నారు. స్టోర్స్ బుక్, రిపోర్ట్స్, రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. దీని మీద సరైన సూపర్‌వైజింగ్ చేయాలని వైద్యాధికారి, పర్యవేక్షణ అధికారులను డీఎంహెచ్‌వో ఆదేశించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాలాజీ, ఎపిడిమిక్ సెల్, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పోటాపోటీగా న్యాయవాదుల సంఘం ఎన్నికల ప్రచారం

విశాఖ లీగల్: విశాఖ న్యాయవాదుల సంఘం ఎన్నికలకు కేవలం రెండు రోజులు మాత్రమే గడువు ఉండటంతో ప్రధాన అభ్యర్థులందరూ పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి కోర్టు ఆవరణ బయట తమ పరిధిలో ప్రచారాన్ని కొనసాగించారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఆడారి ఆనంద్



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న ఆడారి ఆనంద్ కుమార్

గోపాలపట్నం: పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులతో విందులో పాల్గొనడం సంతోషాన్నిచ్చిందని వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. గోపాలపట్నం పరిసర ప్రాంతాల ముస్లింలతో స్థానిక సుకన్య సినిమా హాలు ప్రాంగణంలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరయ్యారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు, పశ్చిమ నియోజకవర్గం మైనారిటీ సంఘం అధ్యక్షుడు నాగూర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముస్లిం పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆశీర్వదించారు. ఆడారి మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతీ మసీదుకు షాదీఖానా ఉండేలా చర్యలు చేపడతామన్నారు. ఎంపీగా బొత్స ఝాన్సీని, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు ఎస్ఏ రహమాన్, పేడాడ రమణి కుమారి, వార్డు అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.